సాక్షి అనంతపురం

శుక్రవారం । 12 । జూలై । 2024



టన్ను చీనీ రూ.20 వేలు
అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.20 వేలు, కనిష్టం రూ.10 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.45
అనంతపురం కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.45, కనిష్టం రూ.32 మేర ధర పలికింది. మార్కెట్‌కు 85 టన్నులు టమాట అమ్మకానికి వచ్చింది.

గరిష్టం/కనిష్టం
36.3°/22.6°

జిల్లా అంతటా గురువారం పగటి,రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 12 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

తల్లి పేరుతో ఒక చెట్టు
అనంతపురం సెంట్రల్: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సెప్టెంబర్ వరకూ తల్లి పేరు మీద ఒక చెట్టు నాటాలని నిర్ణయించినట్లు డీఎఫ్‌ఓ వినీత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 27 అటవీ బీట్‌ల పరిధిలో ఒక్కో బీట్‌కు ఐదు గ్రామాల చొప్పున, ఒక్కో గ్రామంలో 100 మొక్కలు నాటించేలా ప్రణాళికలు తయారు చేసినట్లు వివరించారు. ఇప్పటికే లక్ష మొక్కలు నాటినట్లు తెలిపారు. ఇంకా సామాజిక వన విభాగం నర్సరీలలో 7 లక్షల మొక్కలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని, జిల్లాను హరితవనంగా, సస్యశ్యామలంగా తీర్చిదిద్దాలని విజ్ఞప్తి చేశారు.

రైతుబజార్‌లో బియ్యం, కంది పప్పు విక్రయాలు ప్రారంభం



కందిబేడలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, కమిషనర్ మేఘస్వరూప్

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక రైతుబజార్‌లో బియ్యం, కంది పప్పు విక్రయ కేంద్రాన్ని గురువారం నగరపాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్‌తో కలిసి ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ధరల నియంత్రణలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు విక్రయ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. బహిరంగ మార్కెట్‌లో కన్నా తక్కువకు పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో విక్రయాలు సాగిస్తున్నామన్నారు. కిలోపై రూ.10 నుంచి రూ.15 తక్కువగా ఇస్తున్నామని తెలిపారు. నాణ్యమైన కిలో కంది పప్పు బహిరంగ మార్కెట్‌లో రూ.180 ఉండగా, ఇక్కడ రూ.160, అలాగే బియ్యం ఇక్కడ ఒక రకం రూ.48, మరో రకం రూ.49 ప్రకారం అందుబాటులో ఉంచామన్నారు. రైస్‌మిల్లర్లు, మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విక్రయ కేంద్రం నడుస్తుందన్నారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ అధికారి శోభారాణి, సంస్థ జిల్లా మేనేజర్ రమేష్‌రెడ్డి, మార్కెటింగ్‌శాఖ ఏడీ బి.సత్యనారాయణచౌదరి, రైతుబజార్ అధికారులు ప్రతాప్ రుద్ర, లోకేష్ తదితరులు ఉన్నారు.

డీఆర్‌ఎం బాధ్యతల స్వీకరణ



డీఆర్‌ఎం విజయ్‌కుమార్

గుంతకల్లు: గుంతకల్లు రైల్వే డివిజనల్ మేనేజర్ (డీఆర్‌ఎం)గా ఎం. విజయ్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏడీఆర్‌ఎం సుధాకర్, ఇతర అధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. డీఆర్‌ఎం చాంబర్‌కు ఆహ్వానించారు. ఇన్‌చార్జ్ డీఆర్‌ఎం సుధాకర్ చేతుల మీదుగా విజయ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం డివిజన్ స్థాయి అధికారులతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. గుంతకల్లు రైల్వే డివిజన్ స్థితిగతులు, జరుగుతున్న అభివృద్ధి పనులు తదితర వాటిపై ఆరా తీశారు. సమష్టిగా పని చేస్తూ డివిజన్ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. విధి నిర్వహణలో అంకితభావంతో పని చేయాలన్నారు.

పంటల బీమా ప్రకటించాలి



మాట్లాడుతున్న రైతు సంఘాల నాయకులు

అనంతపురం అర్బన్: రైతులకు 2023 ఖరీఫ్, రబీకి సంబంధించి పంటల బీమా ప్రకటించాలని ప్రభుత్వాన్ని రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, బాలరంగయ్య, కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనకు ఈనెల 18,19 తేదీల్లో గ్రామ సచివాలయాల వద్ద నిరసనలు చేపట్టనున్నట్లు ప్రకటించారు. గురువారం స్థానిక రైతు సంఘం కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడారు. అన్నదాత సుఖీభవ సాయం రూ.20 వేలు వెంటనే రైతులు, కౌలు రైతుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. ఉపాధి పథకం కింద పనిదినాలు 200 రోజులకు పెంచి, రోజు వేతనం రూ.600 ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధి బిల్లులు విడుదల చేయాలన్నారు. 2011 సీసీఆర్‌సీ చట్ట సవరణ చేసి 2009 కౌలు రైతుల చట్టాన్ని అమలు చేయాలన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, పంట రుణం ఇవ్వాలన్నారు. డ్రిప్పు, స్ప్రింక్లర్లపై జీఎస్టీ రద్దు చేయాలని, దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతుకూ 90 శాతం రాయితీ ఇవ్వాలని కోరారు. జిల్లాలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగునీరు ఇవ్వాలని, వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లను అమర్చాలనే జీఓ 22 రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు.



తల్లికి వందనం.. ఎగనామం!



- కుటుంబంలో ఎంతమంది పిల్లలున్నా ఒక్కొక్కరికి రూ. 15 వేలు ఇస్తామని చెప్పిన చంద్రబాబు
- నేడు ప్రతి తల్లికీ అంటూ కొత్తరాగం
- నగదు ఎప్పుడు.. ఎంత ఇస్తారో తెలీక తల్లిదండ్రుల అవస్థలు
- ఫీజులు కట్టాలని డిమాండ్ చేస్తోన్న ప్రైవేటు స్కూళ్ల నిర్వాహకులు
- చంద్రబాబు ప్రభుత్వ తీరుపై విమర్శలు
- గత ప్రభుత్వంలో ఇలాంటి సమస్య లేదంటోన్న లబ్ధిదారులు

'మేం అధికారంలోకి వస్తే అమ్మ ఒడి బదులు 'తల్లికి వందనం' పేరుతో ఇంట్లో ఎందరు ఉంటే అందరు విద్యార్థులకూ ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున తల్లుల బ్యాంకు ఖాతాలోకి జమ చేస్తాం' అంటూ ఎన్నికల సమయంలో చంద్రబాబు ఊదర గొట్టారు. అయితే, ముఖ్యమంత్రిగా ఆయన బాధ్యతలు స్వీకరించి నేటికి నెల గడిచినా, 'తల్లికి వందనం' పథకం అమలుకు నోచుకోలేదు. గత నాలుగేళ్లు పాఠశాలలు పునఃప్రారంభమైన వెంటనే తల్లుల బ్యాంకు ఖాతాల్లోకి 'అమ్మ ఒడి' డబ్బులు జమ కావడం గమనార్హం.

అనంతపురం ఎడ్యుకేషన్: ఏరుదాటాక తెప్ప తగలేసిన చందంగా చంద్రబాబు కొత్త రాగం అందుకున్నారు. ఇటీవల ఎన్నికల్లో ఇంట్లో ఎంత మంది చదువుకునే పిల్లలుంటే అందరికీ 'తల్లికి వందనం' ఆర్థిక సాయం అందిస్తామన్న ఆయన.. నేడు కేవలం ప్రతి తల్లికి ఏడాదికి రూ. 15 వేలు ఇస్తామని మార్గదర్శకాలు జారీ చేయడం పట్ల విద్యార్థుల తల్లులు మండిపడుతున్నారు. ప్రతి విద్యార్థికీ రూ. 15 వేలు అని కాకుండా ప్రతి తల్లికీ ఇస్తామని చెప్పడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నిస్తున్నారు. బాబు ఇచ్చిన హామీలు నమ్మి ఓట్లేశామని తీరా గెలిచిన తర్వాత కోతలు పెట్టేలా ఆలోచించడం సరికాదంటున్నారు.

జగన్ ప్రభుత్వం ఠంచన్‌గా..

పేద పిల్లలను బాగా చదువుకునేలా ప్రోత్సహించాలనే లక్ష్యంతో దేశంలోనే మొట్టమొదటిసారిగా గత జగన్ ప్రభుత్వం 'అమ్మఒడి' పథకానికి శ్రీకారం చుట్టింది. నాలుగు విడతల్లో పథకం కింద రూ.1,718 కోట్లు(ఇందులో రెండేళ్లు ఉమ్మడి జిల్లా) నేరుగా విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. దీంతో పథకం విజయవంతమై డ్రాపౌట్స్ సంఖ్య భారీగా తగ్గింది. గత నాలుగేళ్లూ సక్రమంగా 'అమ్మ ఒడి' సొమ్ము జమ కావడంతో తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలలకు ఫీజులను సకాలంలో చెల్లించారు.

గత నాలుగేళ్లు 'అమ్మ ఒడి' వివరాలిలా..

సంవత్సరం	మొత్తం రూ. కోట్లలో	లబ్ధిపొందిన తల్లులు
2019-20	543.34 (ఉమ్మడిజిల్లా)	3,62,579
2020-21	572.34 (ఉమ్మడిజిల్లా)	3,81,599
2021-22	325.26 (అనంతపురం)	2,16842
2022-23	277.41 (అనంతపురం)	2,13,394

ఆశలు అడియాసలు..

'అమ్మ ఒడి'కి ఆదరణ దక్కడంతో గత ఎన్నికల ముందు చంద్రబాబు కూడా మేనిఫెస్టోలో ఈ పథకాన్ని చేర్చడం అనివార్యమైంది. అయితే, అదే పేరున అమలు చేస్తే జగన్‌కు పేరొస్తుందనే ఉద్దేశంతో 'తల్లికి వందనం'గా మార్చుతామని ప్రకటించారు. కూటమి ప్రభుత్వం వస్తే ఇంట్లో అందరికీ 'తల్లికి వందనం' పేరుతో ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున ఇస్తామని హామీ ఇవ్వడంతో మరిన్ని డబ్బులు వస్తాయని పిల్లల తల్లిదండ్రులు ఆశలు పెట్టుకున్నారు. అయితే ఇప్పటి వరకు అతీగతీ లేకపోవడంతో వారి ఆవేదన వర్ణనాతీతంగా మారింది. ప్రైవేటు ఫీజులు చెల్లించలేక అవస్థలు పడుతున్నారు. ఎంతమందికి ఇస్తారో? ఎప్పుడు ఇస్తారో? ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'తల్లికి వందనం' పథకం కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజులు చెల్లించాలని ఆశతో ఉన్నారు. అయితే కూటమి ప్రభుత్వం మాత్రం ఇప్పటి వరకు స్పష్టత ఇవ్వకపోవడం గమనార్హం. ప్రస్తుతం జిల్లాలో ఒకటి నుంచి 12వ తరగతి వరకు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో సుమారు 3.80 లక్షల మందిపైనే ఉన్నారు. వారందరికీ ఎంతవరకు లబ్ధి చేకూరుస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. దీనికితోడు కేవలం ప్రభుత్వ స్కూళ్లలో చదివే పిల్లలకు మాత్రమే వర్తింపజేయాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలియడంతో తల్లిదండ్రులు మరింత ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో 1 నుంచి ఇంటర్ చదువుతున్న విద్యార్థులు
3,88,944

వీరిలో ఒక్కొక్కరికి ఏటా చంద్రబాబు అందించాల్సినది
రూ. 15 వేలు

ఏడాదికి విడుదల చేయాల్సిన నిధులు
రూ.583.41 కోట్లు

నమ్మకంతో పిల్లల్ని ప్రైవేటులో చేర్చా



నాకు ఇద్దరు పిల్లలు. ఒక్కొక్కరికి ఏటా రూ.15 వేల చొప్పున ఇస్తామనడంతో పిల్లల్ని ప్రైవేటు పాఠశాలలో చేర్పించా. ఏడాదికి ఇద్దరికీ రూ.80 వేల వరకూ ఖర్చు వస్తోంది. ఇంత వరకూ 'తల్లికి వందనం' అమలు చేయకపోవడం అన్యాయం. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. తల్లిదండ్రుల్లో ధైర్యం నింపాలి. గత ప్రభుత్వం లాగా భరోసా కల్పించాలి.

– స్వర్ణలత, ఆత్మకూరు

మాట మార్చడం సరికాదు



నాకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు వేణు అనంతపురంలోని ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఏడాదికి రూ.45 వేలు కడుతున్నా. రెండో కుమారుడు లతీఫ్ శెట్టూరులోని మోడల్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. చంద్రబాబు హామీ మేరకు ఇద్దరికీ కలిపి రూ. 30 వేలు రావాల్సి ఉంది. ఇప్పుడు మాట మార్చడం సరికాదు.

– గీతమ్మ, కనుకూరు గ్రామం, శెట్టూరు మండలం

మోసగించడం దారుణం



నా భర్త నక్కా ఓబులేసు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మాకు ముగ్గురు పిల్లలు. గత నాలుగేళ్లు మొదటి కుమారుడైన అభిరామ్‌కు 'అమ్మ ఒడి' పథకం డబ్బులు అందాయి. చంద్రబాబు సీఎం అయితే ఇంట్లో ఉన్న ప్రతి పిల్లవానికీ రూ.15 వేలు ఇస్తామన్నారు. నేటికీ అందించలేదు. ఇలా మోసగించడం దారుణం.

–నక్కా సౌభాగ్య, దేవరపల్లి గ్రామం, పామిడి మండలం

నాకు రూ. 30 వేలు రావాలి



చంద్రబాబు గత ఎన్నికల ప్రచారంలో చెప్పినట్లుగా 'తల్లికి వందనం' పథకం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటున్నా ఒక్కొక్కరికి ఏటా రూ. 15 వేల చొప్పున ఇవ్వాలి. నాకు ఇద్దరు పిల్లలు. ఒకరు 9వ తరగతి, ఇంకొకరు 6వ తరగతి. ఇద్దరికీ కలిపి ఏడాదికి రూ. 30 వేలు ఇవ్వాలి. ఇప్పుడేమో ఒకరికే ఇస్తామని అంటున్నారు. ప్రజలను నమ్మించి మోసం చేయకూడదు.

– సి.రామలక్ష్మి, అనంతపురం

కొర్రీలు పెట్టడం సరికాదు



నాకు విజయ్, అక్షయ్ ఇద్దరు కుమారులు. ఉరవకొండలోని విజయ ఇంగ్లిషు మీడియం స్కూల్‌లో చదివిస్తున్నా. టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం 'తల్లికి వందనం' అమలు చేయాలి. ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ ఏడాదికి రూ. 15 వేలు ఇస్తామని చెప్పి, ఇప్పుడు కొత్తగా కొర్రీలు పెట్టడం సరి కాదు. పిల్లలను బాగా చదివించడానికి ప్రభుత్వం ఏడాదికి ఇద్దరికి రూ. 30 వేలు ఇవ్వాల్సిందే.

– దొకాలి మంజుల, డ్రైవర్స్ కాలనీ, ఉరవకొండ

పిల్లాడికి రూ. 15 వేలివ్వాలి



నా భర్త గోపాలకృష్ణ, నేను వ్యవసాయ కూలీలుగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాం. మాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. బాబును ఇంటర్, కుమార్తెను 10వ తరగతి అనంతపురంలోని ఓ ప్రైవేటు కళాశాల, స్కూళ్లలో చదివిస్తున్నాం. ఎన్నికల సమయంలో 'తల్లికి వందనం' పేరుతో చంద్రబాబు ఇంట్లో ఎంత మంది పిల్లలున్నా సరే అంతమందికి ఒక్కొక్కరికి రూ.15.వేల చొప్పున ఇస్తానని చెప్పాడు. నేడు వేరే రకంగా మార్గదర్శకాలు ఇవ్వడం బాధాకరం.

–చౌడమ్మ, పుప్పాల గ్రామం, యాడికి మండలం

ఎదురుచూస్తున్నాం



చంద్రబాబు ఎన్నికల ముందు చెప్పిన విధంగా 'తల్లికి వందనం' పథకం ద్వారా ఒక్కొక్కరికి రూ.15 వేలు వస్తుందని ఎదురు చూస్తున్నాం. నాకు ఇద్దరు కుమారులు. అఖిల్‌కుమార్ 3వ తరగతి, అక్షయకుమార్ ఒకటో తరగతి నాయనపల్లి క్రాస్‌లోని శ్రీవినాయక స్కూల్‌లో చదువుచున్నారు. ఇద్దరికీ రూ.30 వేలు అందుతాయని ఆశిస్తున్నాం. అవి పడితే పాఠశాల ఫీజులకు ఉపయోగపడతాయి.

–భాగ్యలక్ష్మి, పి.జలాలపురం గ్రామం, శింగనమల మండలం

ఫీజులకు ఒత్తిడి చేస్తున్నారు



నా ఇద్దరు పిల్లల్నీ ప్రయివేటు స్కూల్‌లో చదివిస్తున్నా. చంద్రబాబు ఎంత మంది పిల్లలున్నా ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున ఇచ్చి పిల్లల చదువులను ప్రోత్సహిస్తానని చెప్పారు. ఇప్పటికే ప్రయివేటు స్కూల్ యాజమాన్యం ఫీజు చెల్లించమని ఒత్తిడి చేస్తున్నారు. ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తే ఫీజులు కడదామని అనుకొన్నాం. ఎలాంటి ఆంక్షలు పెట్టమని చెప్పడంతో నాతోపాటు ఎంతో మంది తల్లులు ఆశలు పెట్టుకొన్నారు.

– సుజాత, కె.కొత్తపల్లి, కణేకల్లు మండలం

పనితీరు మెరుగుపరుచుకోండి

- 'నేను బడికిపోతా' నమోదు పూర్తి కావాలి
- విద్యాశాఖ అధికారులకు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో డీఈఓ వరలక్ష్మి



హాజరైన విద్యాశాఖ అధికారులు

అనంతపురం అర్బన్: ''విద్యాశాఖ పనితీరు మెరుగుపడాలి. నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా బోధన, కార్యక్రమాలు ఉండాలి. బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి. 'నేను బడికిపోతా' కార్యక్రమం ద్వారా చేపట్టిన నమోదు ప్రక్రియ వారంలోగా పూర్తి చేయాలి'' అని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో ఎంఈఓలు, విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు మనం అందించే విలువైన ఆస్తి విద్య అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. నాణ్యమైన విద్యను అందిస్తేనే ఉజ్వల భవిష్యత్తును ఇవ్వగలమన్నారు. కేజీబీవీల్లో 10వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ఉత్తీర్ణత శాతం తక్కువగా ఉందని, ఉత్తీర్ణత పెంచడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. 'నేను బడికి పోతా' కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అన్ని మండలాల్లోనూ కార్యక్రమం పూర్తిస్థాయిలో చేపట్టాలన్నారు. బడిబయట ఉన్న పిల్లలను మొత్తం 3,356 మందిని గుర్తించగా, ఇందులో 1,617 మంది ఉరవకొండలోనే గుర్తించారని, మిగిలిన మండలాల్లో ఎందుకు గుర్తించలేదని ప్రశ్నించారు. పిల్లలతో ఎక్కడా పని చేయించకూడదని చెప్పారు. జ్ఞాన జ్యోతి కార్యక్రమంలో భాగంగా ఎస్‌జీటీలకు, అంగన్‌వాడీ టీచర్లకు పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వాలన్నారు. జ్ఞాన ప్రకాశ్ రిఫ్రెషర్ కింద శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. విద్యార్థులకు కిట్ల పంపిణీ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పీఎంశ్రీ స్కూల్స్‌కు సంబంధించిన పనులు ఏ స్థితిలో ఉన్నాయనే దానిపై నివేదిక అందించాలని ఆదేశించారు.

మధ్యాహ్న భోజన పథకం ఆగకూడదు

జిల్లాలోని 1,694 పాఠశాలల్లో 1,87,954 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలవుతోందని, ఏ కారణం చేత కూడా ఏ ఒక్క పాఠశాలలోనూ మధ్యాహ్న భోజన పథకం ఆగకూడదన్నారు. ఏదైనా సమస్య వస్తే 24 గంటల్లో పరిష్కరించాలని డీఈఓ వరలక్ష్మిని ఆదేశించారు. విద్యాశాఖలో కేడర్ వారీగా అధికారుల స్థాయి నుంచి వాచ్‌మెన్ వరకు ఉన్న ఖాళీల వివరాలను అందించాలని ఆదేశించారు. ప్రతి నెల 15వ తేదీలోగా బిల్లులు సమర్పించాలని, ఆలస్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో విద్యాశాఖ ఏడీలు కృష్ణయ్య, నాగరాజు, ఏఎంఓ చంద్రశేఖర్‌రెడ్డి, సీఎంఓ గోపాల్, జీసీడీఓ వాణిదేవి, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి రైల్వే సీనియర్ డీఎంఈగా ప్రమోద్



గుత్తి: గుత్తి రైల్వే డీజిల్ షెడ్ సీనియర్ డీఎంఈగా ప్రమోద్ బాధ్యతలు స్వీకరించారు. స్థానిక డీజిల్‌షెడ్‌లో డీఎంఈగా పని చేస్తున్న ప్రమోద్‌కు దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ సీనియర్ డీఎంఈగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ సీనియర్ డీఎంఈగా పని చేస్తున్న రమేష్‌ను తిరుపతికి బదిలీ చేశారు. సీనియర్ డీఎంఈగా పదోన్నతి పొందిన ప్రమోద్ స్వస్థలం కడప జిల్లా ప్రొద్దుటూరు. ఈయన ముంబాయి ఐఐటీలో ఇంజినీరింగ్ చదివారు. మూడేళ్లుగా గుత్తి డీజిల్ షెడ్‌లో డీఎంఈగా పని చేస్తున్నారు. ప్రమోద్‌కు పదోన్నతి రావడంతో రైల్వే అధికారులు, రైల్వే యూనియన్ నాయకులు, కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం శుభాకాంక్షలు తెలిపారు.

కీచకులను కఠినంగా శిక్షించాల్సిందే

- చిన్నారి హత్యాచారంపై పెల్లుబికిన నిరసన



కొవ్వొత్తుల ప్రదర్శనలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వాల్మీకి సంఘం ప్రతినిధులు

అనంతపురం సిటీ: నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం ఎల్లాల గ్రామంలో ఎనిమిదేళ్ల చిన్నారిపై సామూహిక అత్యాచారానికి ఒడిగట్టి, ఆపై హత్య చేసిన కీచకులను కఠినంగా శిక్షించాలని ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ డిమాండ్ చేశారు. వాల్మీకి ఉద్యోగుల సంక్షేమ సంఘం (వీఈడబ్ల్యూఏ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అనంతపురంలో గురువారం రాత్రి నిరసన ప్రదర్శన నిర్వహించారు. వాల్మీకి సంఘం ప్రతినిధులు కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ అభం శుభం ఎరుగని చిన్నారిపై హత్యాచారానికి ఒడిగట్టి, మృతదేహాన్ని కాలువలో పడేయడం దారుణమన్నారు. ఈ ఉదంతంలో పోలీసులు ముగ్గురిని ఇరికించి, పలుకుబడి కలిగిన ఒక నిందితుడిని తప్పించేందుకు ప్రయత్నించడం అన్యాయమన్నారు. ఘటన జరిగి నాలుగు రోజులు దాటినా ప్రభుత్వం నుంచి సరైన స్పందన లేదని, ఒక మహిళ రాష్ట్ర హోం మంత్రిగా ఉండగా, చిన్నారిపై సామూహిక హత్యాచారం ఘటనను నీరుగార్చేందుకు పోలీసు యంత్రాంగం ప్రయత్నిస్తుంటే కనీస స్పందన లేకపోవడం దుర్మార్గమన్నారు. నిందితులందరినీ ఎన్‌కౌంటర్ చేసినప్పుడే చిన్నారి ఆత్మకు శాంతి కలుగుతుందని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి, నిందితులను శిక్షించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డీఎస్పీ ప్రతాప్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో వాల్మీకి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు అక్కులప్ప, రాష్ట్ర యువసేన అధ్యక్షుడు హరి, ఇతర ప్రతినిధులు, వాల్మీకులు పాల్గొన్నారు.

కన్నతల్లిపై కత్తితో దాడి

- విషయం తెలుసుకుని మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న రెండో కుమారుడు



బాధితురాలు లక్ష్మీదేవి

శెట్టూరు/కుందుర్పి: కన్నతల్లిపై పెద్ద కుమారుడు కత్తితో దాడి చేశాడు. విషయం తెలుసుకున్న రెండో కుమారుడు మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... శెట్టూరు మండలం ముచ్చర్లపల్లికి చెందిన లక్ష్మీదేవి భర్త కొన్నేళ్ల క్రితమే మరణించాడు. ఈ క్రమంలో తన ఇద్దరు కుమారులను ఆమె పెంచి పెద్ద చేసి, పెళ్లిళ్లు చేసింది. కుందుర్పి మండలం కలిగొలిమికి చెందిన యువతిని పెళ్లి చేసుకున్న రెండో కుమారుడు రాజు.. ఎనిమిదేళ్లుగా భార్యతో కలసి అక్కడే నివాసముంటున్నాడు. పెద్ద కుమారుడు శివరాజ్‌తో కలసి తల్లి ముచ్చర్లపల్లిలోనే నివాసముంటోంది. అప్పుడప్పుడు తల్లి వద్దకు చిన్న కుమారుడు వచ్చి పలకరించి వెళ్లేవాడు. శివరాజ్ మద్యానికి బానిసగా మారడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో తాగుడు మానేయాలని పలుమార్లు తల్లి లక్ష్మీదేవి ప్రాధేయపడినా వినేవాడు కాదు. బుధవారం అర్ధరాత్రి మద్యం తాగి ఇంటికి చేరుకున్న కుమారుడిని తల్లి మందలించింది. దీంతో ఆవేశానికి లోనైన శివరాజ్ కత్తితో ఆమెపై దాడి చేశాడు. ఆమె కేకలు విన్న చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకున్నారు. గొంతుపై తీవ్రగాయమైన లక్ష్మీదేవిని వెంటనే కళ్యాణదుర్గంలోని ఆస్పత్రికి, అనంతరం అనంతపురానికి తరలించారు.

తీవ్ర మనోవేదనతో ఆత్మహత్య..

తల్లిపై అన్న కత్తితో దాడి చేసిన విషయం గురువారం ఉదయం తెలుసుకున్న కలిగొలిమిలోని రాజు (29) తీవ్ర మనోవేదనకు లోనయ్యాడు. తమ కోసం తల్లి పడిన కష్టం తలుచుకుని కుమిలిపోయాడు. జీవితంపై విరక్తితో కలిగొలిమి శివారులో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న భార్య శిల్ప, ఇద్దరు పిల్లలు బోరున విలపించారు. ఈ ఘటనపై కుందుర్పి పోలీసులు కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

ఉద్యాన పంటలపై దృష్టి సారించాలి

- జిల్లా ఉద్యానశాఖ అధికారి ఫిరోజ్‌ఖాన్, డీఆర్‌ఐపీ పీడీ రఘునాథరెడ్డి



అల్ల నేరేడు తోటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖాధికారులు

బొమ్మనహాళ్: ఉద్యాన తోటల పెంపకంపై దృష్టి సారించాలని రైతులకు జిల్లా ఉద్యానశాఖ అధికారి ఫిరోజ్‌ఖాన్, డీఆర్‌ఐపీ పీడీ రఘునాథరెడ్డి సూచించారు. బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్‌లో రైతు మారుతీప్రసాద్ సాగు చేసిన అల్ల నేరేడు పంట, నేరేడు జ్యూస్ తయారీ విధానాన్ని మండల ఉద్యాన అధికారి మౌనికతో కలసి గురువారం వారు పరిశీలించారు. నేరేడు పండ్ల దిగుబడి, జ్యూస్ తయారీ విధానం, మార్కెటింగ్ తదితర అంశాలను వారికి మారుతీ ప్రసాద్ వివరించారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ.. చౌడు భూముల్లో నేరేడు పంటను పండించవచ్చునన్నారు. రైతు మారుతీప్రసాద్ చౌడు భూముల్లో అల్ల నేరేడు పంట సాగు చేసి మంచి దిగుబడి సాధిస్తుండడంపై హర్షం వ్యక్తం చేశారు. అంతేకాక నేరేడు పండ్లతో ప్రత్యేకంగా జామున్, జ్యూస్ తయారీ చేపట్టి అధిక లాభాలు గడిస్తున్నారన్నారు. షుగర్ వ్యాధితో బాధపడేవారి కోసం ప్రత్యేకంగా షుగర్ కేర్ జ్యూస్ తయారు చేస్తున్నట్లు తెలిపారు. ఉద్యాన తోటల పెంపకానికి ముందుకు వచ్చే రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా రాయితీలు కల్పిస్తోందన్నారు.

ట్రాక్టర్ ఢీకొని వృద్ధురాలి మృతి

యల్లనూరు: మండలంలోని తిమ్మంపల్లిలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ తగిలి పెద్దక్క(73) మృతి చెందింది. గురువారం ఉదయం ఎరువులు తరలిస్తున్న ట్రాక్టర్ రివర్స్ చేస్తుండగా ప్రమాదవశాత్తు వెనుకవైపు ఉన్న పెద్దక్కకు తగిలి మృతి చెందింది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

కరుణించిన తుంగభద్ర



వరదనీటితో తొణికిసలాడుతున్న తుంగభద్ర డ్యాం



ఆయకట్టులో పెరుగుతున్న వరి నార్లు

- హెచ్చెల్సీ వాటాగా 26.36 టీఎంసీలు
- తాగు, సాగు నీటికి తప్పిన ముప్పు
- ఆయకట్టు రైతుల్లో చిగురిస్తున్న ఆశలు
- ఇప్పటి వరకూ 25.173 టీఎంసీల నీరు చేరిక
- 20,285 క్యూసెక్కులతో కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

రాయదుర్గం: దాదాపు నెల రోజుల క్రితం వరకూ తీవ్ర వర్షాభావంతో బోసిపోయిన తుంగభద్ర డ్యాం (టీబీ డ్యాం) ఒక్కసారిగా కరుణించింది. జలాశయం ఉపరితలంలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణ ప్రజల జీవనాడిగా ఉన్న టీబీ డ్యాం జలకళను సంతరించుకుంది. జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 105.788 టీఎంసీలు కాగా, 20,285 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో గురువారం నాటికి 27.330 టీఎంసీలకు చేరుకుంది. జలాశయం నుంచి 12,548 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. కేవలం పది రోజుల వ్యవధిలోనే జలాశయానికి 15 టీఎంసీలకు పైగా వరద చేరడం విశేషం.

172 టీఎంసీల లభ్యత..

తుంగభద్ర జలాశయం ఉపరితలంలోని శివమొగ్గ, ఆగుంబె, తీర్థహళ్లి, సాగర, హొసనగర, కడూరు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో అప్పర్ భద్ర గేట్లను అధికారులు ఎత్తి నీటిని దిగువకు వదిలడంతో టీబీ డ్యాంకు వరద పోటెత్తింది. ఈ ఏడాది జలాశయానికి 172 టీఎంసీల నీటి లభ్యత ఉంటుందని అధికారులు వేసిన అంచనాలు ఫలించేలా కనిపిస్తున్నాయి. దీంతో హెచ్చెల్సీ వాటాగా 26.36 టీఎంసీలు కేటాయించారు. ఈ నీటితో కనీసం లక్ష ఎకరాలు సాగులోకి వచ్చే అవకాశముందని అధికారుల అంచనా.

ఖరీఫ్ పనుల్లో నిమగ్నం..

హెచ్చెల్సీ పరిధిలో మొత్తం 2.85 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. నెల రోజుల క్రితం వరకూ టీబీ డ్యాంకు నీటి లభ్యత లేదని తెలుసుకున్న ఆయకట్టు రైతులు ఖరీఫ్ సాగుపై ఆశలు వదులుకున్నారు. అయితే అనూహ్యంగా టీబీ డ్యాం జలకళను సంతరించుకోవడంతో ఆయకట్టు రైతులు ఖరీఫ్ సాగు పనుల్లో తలమునకలయ్యారు. హెచ్చెల్సీ ఎగువ ప్రాంతాల్లోని రైతులు బోర్ల ఆధారంగా వరి నారు పెంపకాన్ని చేపట్టారు. ఆయకట్టుకు నీరు వదలగానే నాట్లు వేసేందుకు అన్ని వనరులూ సిద్ధం చేశారు.

టీబీ డ్యాంలో 27 టీఎంసీల నీరు

బొమ్మనహాళ్: కర్ణాటకలోని తుంగభద్ర జలాశయంలో 105.788 టీఎంసీలకు గాను 27.330 టీఎంసీల నీరు చేరింది. జలాశయానికి ఎగువన విస్తారంగా వర్షాలు కుస్తుండటంతో తుంగభద్రకు భారీగా వరద వచ్చి చేరుతోంది. గత ఏడాది ఇదే సమయానికి డ్యామ్‌లో 1,581.82 అడుగులతో 5.419 టీఎంసీలతో 17,761 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండి 265 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉండేదని బోర్డు అధికారులు తెలిపారు.

ఆశాజనకంగా వరద

తుంగభద్ర డ్యాంలోకి ఆశాజనకంగా వరద వచ్చి చేరుతోంది. గతేడాది ఇదే సమయానికి కేవలం 3 టీఎంసీలు మాత్రమే ఉండేవి. జలాశయం ఉపరితలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురుస్తుండడంతో డ్యాం లోకి ప్రస్తుతం 20,285 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతుంది. ఈ ప్రవాహం ఇలాగే కొనసాగితే ఆయకట్టుకు పుష్కలంగా నీరు అందించవచ్చు.

– రమణారెడ్డి, హెచ్చెల్సీ ఈఈ, అనంతపురం

జనాభా పెరుగుదల అభివృద్ధికి అవరోధం

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబ దేవి



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబ దేవి

అనంతపురం మెడికల్: జనాభా పెరుగుదల దేశాభివృద్ధికి అవరోధమని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి పేర్కొన్నారు. గురువారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల నుంచి సప్తగిరి సర్కిల్ వరకు చేపట్టిన ర్యాలీని డీఎంహెచ్‌ఓ జెండా ఊపి ప్రారంభించారు. సప్తగిరి సర్కిల్ వద్ద మానవహారంగా ఏర్పడి ప్రపంచ జనాభా దినోత్సవ ప్రాముఖ్యతను డీఎంహెచ్‌ఓ తెలియజేశారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా కుటుంబ నియంత్రణను పాటించాలన్నారు. 1989 నుంచి ఏటా జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 'తల్లి, బిడ్డ శ్రేయస్సు కోసం సరైన సమయంలో గర్భధారణ, బిడ్డబిడ్డకూ అంతరం అన్న లక్ష్యంతో కుటుంబ ప్రణాళిక అనేది కొత్త గుర్తింపు, దంపతులకు గర్వకారణం' అన్న నినాదంతో ఈ సంవత్సరం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం పేదరికాన్ని, ఆరోగ్య పరిస్థితులను మెరుగుపర్చడం, విద్య ఆరోగ్య సంరక్షణ, మహిళలు, బాలికలకు సమాన అవకాశాలను ప్రోత్సహించడం ద్వారా స్థిరమైన అభివృద్ధిని ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. కుటుంబ నియంత్రణ కోసం రెండు పద్ధతులను పాటించవచ్చని తెలిపారు. కండోమ్ వాడకం, అంతర ఇంజెక్షన్ వేసుకోవడం, గర్భనిరోధక మాత్రలు, పీపీఐయూసీడీ, అలాగే శాశ్వత పద్ధతులలో మహిళలు ట్యూబెక్టమీ చేయించుకోవడం ఉత్తమమన్నారు. పురుషులు వ్యాసెక్టమీ చేయించుకోవచ్చని తెలిపారు. అనంతరం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో కుటుంబ నియంత్రణ కోసం ఉత్తమ సేవలందించిన వైద్యులు, ఏఎన్‌ఎం, ఆశ, తదితరులను డీఎంహెచ్‌ఓ అభినందించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ డాక్టర్ శ్రీదేవి, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సుజాత, డాక్టర్ యుగంధర్, డాక్టర్ నారాయణస్వామి, డాక్టర్ గంగాధర్, డాక్టర్ రవిశంకర్, మలేరియా అధికారి ఓబులు, స్టాటిస్టికల్ అధికారి మహమ్మద్ రఫీ, డెమో త్యాగరాజు, డిప్యూటీ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు 'సెంట్రల్' విద్యార్థులు



భానుమహేశ్వరి



లిఖిత



మహిమ జ్యోతి



చిన్మయి

అనంతపురం: కేంద్రీయ విద్యాలయ ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే క్రీడల్లో భాగంగా ఇటీవల గుంటూరు, హైదరాబాద్‌ల్లో జరిగిన రీజనల్ స్థాయి కబడ్డీ పోటీల్లో ఎస్కేయూ క్యాంపస్‌లోని పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. అర్హత సాధించిన వారిలో భాను మహేశ్వరి, లిఖిత, మహిమ జ్యోతి, చిన్మయి ఉన్నారు. అండర్–17 బాలికల విభాగంలో ఇప్పటికే వరుసగా నాలుగుసార్లు విజేతగా నిలిచిన గచ్చిబౌలిలోని కేంద్రీయ విద్యాలయ జట్టును ఓడించడంలో జిల్లాకు చెందిన విద్యార్థులు కీలకంగా వ్యవహరించారు. త్వరలో న్యూఢిల్లీ వేదికగా జరిగే జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో హైదరాబాద్ రీజియన్ తరఫున వీరు ప్రాతినిధ్యం వహించనున్నట్లు కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ ఎస్.కరీంఖాన్ తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులను గురువారం ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

చింతలరాయుడిని దర్శించుకున్న అహోబిల పీఠాధిపతి

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని ప్రసిద్ధ చింతల వేంకటరమణస్వామి ఆలయాన్ని గురువారం అహోబిల పీఠాధిపతి రామానుజ జీయర్ స్వామి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ ప్రధాన అర్చకులు మురళీ బట్టార్ తదితరులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గర్భాలయంలోని మూలవిరాట్‌ను స్వామీజీ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలను అర్చకులు అందజేసి, ఆలయ విశేషాలను వివరించారు.

ధర్మమే మనల్ని కాపాడుతుంది

ధర్మాన్ని కాపాడితే అది మనల్ని కాపాడుతుందని అహోబిల త్రిదండి రామానుజ జీయర్ స్వామి పేర్కొన్నారు. గురువారం తాడిపత్రిలోని ఎస్ఎల్ఎస్ గార్డెన్స్‌లో లోక కల్యాణార్థం వికాస తరంగిణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భాగవత సప్తాహ జ్ఞానయజ్ఞ మహోత్సవ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన స్వామీజీ భాగవతంలోని పలు అంశాలను వివరించారు. అధర్మాన్ని, అక్రమాన్ని అవినీతిని అందలాలెక్కిస్తే న్యాయం ధర్మం అనేవి నశిస్తాయన్నారు. దీతో మానవులు ఇబ్బందుల పాలవుతారన్నారు. అంతకు ముందు స్థానిక రెడ్డి వారిపాలెంలోని కోదండరామస్వామి ఆలయం నుంచి స్వామీజీ శోభాయాత్ర వేడుకగా సాగింది.



తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్న రామానుజ జీయర్ స్వామి

'అనంత'లో రేపు జగన్నాథ రథయాత్ర



దామోదర గౌరంగదాసు

అనంతపురం కల్చరల్: అనంత వేదికగా శనివారం ఉదయం పూరీ జగన్నాథ రథయాత్ర జరగనుంది. ఇస్కాన్ ఆధ్వర్యంలో వేడుకలకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఈ మేరకు ఇస్కాన్ అనంతపురం శాఖ చైర్మన్ దామోదర గౌరంగదాసు గురువారం వెల్లడించారు. ప్రపంచ శాంతిని సాధించే దిశగా ఇస్కాన్ భక్తిమార్గం పయనియస్తోందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. సమాజాన్ని అంతటినీ ఏకం చేసే ఆధ్యాత్మిక కార్యక్రమాల పరంపర ద్వారా జ్ఞాన ప్రచారం, వసుధైక కుటుంబ నిర్మాణమే ఇస్కాన్ ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. ఈ క్రమంలో ఏటా అనంతపురంలో పూరీ జగన్నాథ రథయాత్రను వైభవంగా నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. గతంలో కంటే ఈసారి రెట్టింపు స్థాయిలో అనంత ఖ్యాతిని చాటేలా రథయాత్ర కొనసాగుతుందన్నారు. ఆధ్యాత్మిక వేడుకలో భాగస్వాములై ఇస్కాన్ ప్రత్యేకంగా అందజేస్తున్న శ్రీవారి ప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు.

రథయాత్ర సాగుతుందిలా :

కళాజాత, ఆధ్యాత్మిక ప్రవచనాలు, వేద పఠనం నడుమ జగన్నాథ రథయాత్ర రెండు రోజుల పాటూ అంగరంగ వైభవంగా జరుగుతుంది. అందులో భాగంగా తొలిరోజు శనివారం మధ్యాహ్నం 4 గంటలకు అనంతపురంలోని కేఎస్ఆర్ కాలేజ్ సమీపంలో మహాఅభిషేకంతో వేడుకలు ప్రారంభం కానున్నాయి. అక్కడ నుంచి నగర పాలక సంస్థ కార్యాలయం, సుభాష్‌రోడ్, టవర్‌క్లాక్, రాజు రోడ్డు, శ్రీకంఠం సర్కిల్, తిలక్‌రోడ్, గాంధీ బజార్, పాతూరు బసవన్నకట్ట మీదుగా మళ్లీ సప్తగిరి సర్కిల్ ఆపైన నేరుగా ఇస్కాన్ మందిరానికి రథయాత్ర చేరుకుంటుంది. ఇస్కాన్ జీబీసీ చైర్మన్ శ్రీమాన్ రేవంత్ రమణ్‌దాస్ ప్రభు విశిష్ట అతిథిగా విచ్చేసి రథయాత్రను ప్రారంభించనున్నారు. అలాగే కళాజాతను పలువురు ప్రజాప్రతినిధులు ఆరంభిస్తారు. ఆదివారం సాయంత్రం అనంతపురంలోని లలితకళాపరిషత్తులో శ్రీకృష్ణ, బలరామ, సుభద్రాదేవిల మహా అభిషేకం, పుష్పార్చన అనంతరం రేవంత్ రమణదాసు అనుగ్రహ భాషణం ఉంటుంది.

జంబుద్వీప చక్ర సందర్శన

వజ్రకరూరు: వజ్రకరూరు మండలం కొనకొండ్లలోని జంబుద్వీప చక్రాన్ని గురువారం ఉదయం పురావస్తు, దేవాదాయ, భూగర్భ గనులు శాఖ అధికారులు సందర్శించారు. కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు జంబుద్వీప చక్రం అభివృద్ధితో పాటు తీసుకోవాల్సిన సంరక్షణ చర్యలపై నివేదిక సిద్ధం చేయనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పురావస్తు శాఖ ఏడీ రజిత, ఎండోమెంట్ ఏసీ ఆదికేశవనాయుడు, తహసీల్దార్ మహమ్మద్ రఫీ, ఎంపీడీఓ విజయలలిత, మైన్స్ అధికారులు పాల్గొన్నారు.

అందుబాటులో ఇంటర్ మార్కుల జాబితాలు

అనంతపురం ఎడ్యుకేషన్: మార్చి, మేలో జరిగిన ఇంటర్ వార్షిక, సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన ద్వితీయ సంవత్సరం విద్యార్థుల మార్కుల జాబితాలో అందుబాటులో ఉన్నాయని ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి వెంకటరమణనాయక్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇంటర్ బోర్డు నుంచి ఒరిజినల్ మార్కుల జాబితాలు ఆర్ఐఓ కార్యాలయానికి చేరాయన్నారు. శుక్రవారం నుంచి అన్ని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు వచ్చి తీసుకెళ్లవచ్చని పేర్కొన్నారు. మార్కుల జాబితాలు పొందేందుకు సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్ తప్పనిసరిగా అనుమతిపత్రం పంపాలని స్పష్టం చేశారు.

చీటీల పేరుతో కుచ్చుటోపీ

- దాదాపు రూ.2 కోట్ల మోసం
- రైల్వే విశ్రాంత ఉద్యోగి నిర్వాకంపై బాధితుల ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు బారులు తీరిన బాధితులు

గుత్తి: స్థానిక రైల్వే స్టేషన్ ప్రాంతానికి చెందిన రైల్వే విశ్రాంత ఉద్యోగి అత్తార్ హుస్సేన్ చీటీల పేరుతో తమను మోసం చేశాడంటూ పలువురు బాధితులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాదాపు రూ.2 కోట్లతో అజ్ఞాతంలోకి వెళ్లినట్లు ఆరోపించారు. పోలీసులు తెలిపిన మేరకు... గుత్తి ఆర్ఎస్‌లోని బండిమోటు వీధికి చెందిన అత్తార్ హుస్సేన్ చీటీల వ్యాపారం చేసేవాడు. నమ్మకస్తుడు కావడం, అందులోనూ రైల్వే విశ్రాంత ఉద్యోగి కావడంతో చాలా మంది మహిళలు ఎంతో నమ్మకంగా రూ.లక్షల్లో చీటీలు కడుతూ వచ్చారు. ఈ క్రమంలో నెల రోజులుగా అత్తార్ హుస్సేన్ కనిపించకుండా పోయాడు. చీటీలు వేసిన మహిళలు రోజూ అత్తార్ హుస్సేన్ ఇంటి వద్దకెళ్లి, ఆయన లేడని తెలుసుకుని నిరాశతో వెనుతిరగడం పరిపాటిగా మారిపోయింది. ఈ క్రమంలో ఆయన పరారీలో ఉన్నట్లు గురువారం తెలుసుకున్న 40 మంది మహిళలు రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై సీఐ వెంకట్రామిరెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

హిటాచీ స్వాధీనం

శింగనమల: మండలంలోని తరిమెల సమీపంలోని నిదనవాడ వద్ద పెన్నానదిలో నుంచి ఇసుకను అక్రమంగా తరలించేందుకు కొందరు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో గురువారం హిటాచీని అక్కడకు చేర్చారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకోవడంతోహిటాచీని వదిలేసి డ్రైవర్ పరారయ్యాడు. దీంతో పోలీసులు పెన్నానదిలోకి వెళ్లి అక్కడ వదిలేసిన హిటాచీని శింగనమల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వాహన నంబర్ ఆధారంగా యజమాని ఎవరో గుర్తించి కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

గూగూడులో పటిష్ట బందోబస్తు



బందోబస్తుపై సూచనలిస్తున్న ఎస్పీ గౌతమిశాలి

నార్పల: మొహర్రం ఉత్సవాల నేపథ్యంలో గూగూడులో పటిష్ట బందోబస్తు నిర్వహించాలని ఎస్పీ గౌతమిశాలి అన్నారు. బుధవారం ఆమె గూగూడు గ్రామాన్ని సందర్శించారు. ఉత్సవాలు ముగిసే వరకూ బందోబస్తు నిర్వహించాలన్నారు. ఎటువంటి అల్లర్లు, గొడవలు, దొంగతనాలు జరగకుండా చూసుకోవాలన్నారు. అగ్ని గుండం చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచు రమణకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ శివశంకర్ రెడ్డి, సీఐ శ్రీధర్, ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన డిప్లొమో విద్యార్థినులు

అనంతపురం: న్యూఢిల్లీకి చెందిన ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) మంజూరు చేస్తున్న ప్రగతి మెరిట్ స్కాలర్‌షిప్‌కు అనంతపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన 9 మంది విద్యార్థినులు అర్హత సాధించారు. అర్హత సాధించిన వారిలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ విద్యార్థులు కె.జోషిత, పి.మౌనిక, కేఎం నందిని, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్ విభాగంలో కె.నవ్యశ్రీ, జి.హర్షిణి, వి.మహాలక్ష్మి, బి.శ్రేయ, సివిల్ బ్రాంచ్‌లో నందిని, ఎస్.మీనాక్షి ఉన్నారు. వీరిలో ఒక్కొక్కరికి ఏడాదికి రూ.50 వేలు చొప్పున మూడేళ్ల కోర్సు పూర్తి అయ్యే వరకూ స్కాలర్‌షిప్‌ను ఏఐసీటీఈ అందజేయనుంది. ప్రతిభ చాటిన విద్యార్థినిలను ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సి.జయచంద్రారెడ్డి, ఆటోమొబైల్ విభాగాధిపతి ఎస్.శ్రీనివాసరావు, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఎం.రామకృష్ణారెడ్డి అభినందించారు.

జలవనరులశాఖ సీఈగా నాగరాజ

అనంతపురం సెంట్రల్: జలవనరులశాఖ సీఈగా నాగరాజ అదనపు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన హంద్రీనీవా కర్నూలు ఎస్ఈగా పనిచేస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న సీఈ శ్రీనివాసరెడ్డి పదవీ విరమణ పొందారు. దీంతో ఇన్‌చార్జ్ బాధ్యతలను నాగరాజుకు అప్పగించారు.

పెళ్లి మాటున వంచన..

- యువకుడి మాయలో మోసపోయిన పాడేరు యువతి
- అవసరం తీరాక అజ్ఞాతంలోకి వెళ్లిన గుంతకల్లు ప్రేమికుడు
- న్యాయం జరిగే వరకూ ఇక్కడి నుంచి కదిలేది లేదన్న బాధితురాలు

గుంతకల్లు రూరల్: ప్రేమ పేరుతో నమ్మించాడు... పెళ్లి చేసుకుంటానని రప్పించాడు... శారీరక అవసరం తీరాక అజ్ఞాతంలోకి వెళ్లాడు. 875 కిలోమీటర్లకు పైగా దూరం నుంచి వచ్చిన యువతి నిస్సహాయ స్థితిలో పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలు నందిని తెలిపిన వివరాలు ఆమె మాటల్లోనే...

ఫోన్ కాల్ పరిచయం...

మాది అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు గ్రామం. నా చిన్నప్పుడే నాన్న చనిపోయాడు. అమ్మ కౌసల్య కూలి పనులతో నన్ను పదో తరగతి వరకూ చదివించింది. ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో చదువు మానేసి, కూలి పనులతో అమ్మకు చేదోడుగా ఉంటూ వచ్చాను. సరిగ్గా ఆరేళ్ల క్రితం నా సెల్‌ఫోన్‌కు ఓ కాల్ వచ్చింది. అవతలి వ్యక్తి తన పేరు స్వామి అని తెలిపాడు. పొరపాటున కాల్ వచ్చిందని తెలిపాడు. దీంతో రాంగ్ నంబర్ అని తెలుసుకుని ఇద్దరమూ ఫోన్ కట్ చేశాం. అయితే అక్కడితో ఆయన ఆగలేదు. అప్పడప్పుడు ఫోన్ చేసి పలకరించేవాడు. ఆ పరిచయం మా మధ్య ప్రేమకు దారి తీసింది. రాను రాను ఫోన్‌లో గంటల తరబడి అర్ధరాత్రి వరకూ మాట్లాడుకునేవాళ్లం. ఒకరి ఫొటోలు మరొకరు షేర్ చేసుకున్నాం. వీడియో కాల్స్‌తో మరింత దగ్గరయ్యాం.

తనకు పెళ్లయిందన్నాడు..

మా పరిచయం ప్రేమగా మారిని కొన్నాళ్లకు స్వామి తనది అనంతపురం జిల్లా గుంతకల్లు అని తెలిపాడు. ఓ పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్నట్లుగా, తనకు ఇదివరకే పెళ్లి అయిందని... భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని చెప్పాడు. దీంతో ఒక్కసారిగా నివ్వెర పోయాను. పెళ్లి అయి ఉండి ప్రేమ పేరుతో నాకేందుకు దగ్గరయ్యావని ప్రశ్నించా. ఈ విషయం మొదట్లోనే చెబితే ఎక్కడ దూరం అవుతావోననే భయంతో చెప్పలేదన్నాడు. రోజూ నాతో మాట్లాడకపోతే బతకలేనని, తనను నమ్మాలని ప్రాధేయపడ్డాడు. చాలామంది రెండేసి పెళ్లిళ్లు చేసుకుంటున్నారని, అలాగే నన్నూ రెండో పెళ్లి చేసుకుంటానన్నాడు. ప్రాధేయపడ్డాడు. ఆయన మాటలు నమ్మాను.

పెళ్లి చేసుకుంటానంటే వచ్చా..

కొన్ని రోజుల క్రితం పెళ్లి ప్రస్తావన లేవనెత్తాను. అయితే అంత దూరం తాను రాలేనని, నన్నే గుంతకల్లుకు రమ్మని చెప్పాడు. ఒక్కదాన్నే అంతదూరం రావడం ఎలా? అని ఆందోళనతో అడిగా. చదువుకున్నదానివి ఆ మాత్రం రాలేవా? అంటూ ధైర్యం చెప్పాడు. అన్ని విధాలుగా తోడుంటానన్నాడు. దీంతో ధైర్యం చేసి ఈ నెల 9న పాడేరులో బయలుదేరి మరుసటి రోజు కర్నూలుకు చేరుకున్నా. అప్పటికే అక్కడ నా కోసం స్వామి ఎదురు చూస్తూ ఉన్నాడు. తర్వాత ఇద్దరమూ కలసి గుంతకల్లుకు చేరుకున్నాం. గుంతకల్లు పట్టణ శివారులోనే కసాపురం రోడ్డు సమీపంలో స్వామి అప్పటికే తీసి ఉంచిన ఖాళీగా ఉన్న గదికి చేరుకున్నాం. మరుసటి రోజు పెళ్లి చేసుకునేందుకు ఏర్పాట్లు చేశానని చెప్పడంతో నా ఆనందానికి అవధుల్లేకుండాపోయాయి. ఆ సమయంలోనే స్వామి మాయ మాటలతో నన్ను లోబర్చుకున్నాడు.

అవసరం తీరాక వెళ్లిపోమ్మన్నాడు..

తన శారీరక అవసరం తీరాక స్వామి అసలు రూపం బయట పెట్టాడు. నన్ను మా ఊరికి వెళ్లిపోవాలన్నాడు. నేను కాదూకూడదన్నాను. పెళ్లి చేసుకుంటానంటే ఇంత దూరం వచ్చానన్నా. ఇప్పుడు అవసరం తీరాక నన్ను వదిలించుకోవాలనుకుంటే తాను ఊరుకునేది లేదని చెప్పా. జీవితమంతా ఇక్కడే ఉంటానని, ఎలాంటి పరిస్థితుల్లోనూ పెళ్లి కాకుండా ఊరికి వెళ్లేది లేదని చెప్పాను. దీంతో కాసేపు స్వామి మౌనంగా ఉండిపోయాడు. తర్వాత అలా బయటకు వెళ్లి తినేందుకు ఏదైనా తీసుకువస్తానని చెప్పి వెళ్లాడు. బుధవారం సాయంత్రం నన్ను గదిలో వదిలేసి వెళ్లినోడు గురువారం ఉదయం వరకూ తిరిగి రాలేదు. దీంతో నన్ను స్వామి మోసం చేశాడని తెలుసుకుని కుమిలి పోయాను. విషయాన్ని కసాపురం పోలీసులకు తెలిపి నాకు న్యాయం చేయాలని కోరాను. నాకు న్యాయం జరిగే వరకూ ఇక్కడి నుంచి నేను పోను.



మోసపోయిన నందిని

విచారణ చేస్తున్నాం

బాధితురాలు నందిని చేసిన ఫిర్యాదు మేరకు వివరాలు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నాం. యువతిని వదిలి వెళ్లిన స్వామికి ఫోన్ చేసి స్టేషన్‌కు రప్పించే ప్రయత్నం చేస్తున్నాం. ఆయన రాగానే పూర్తి వివరాలు విచారణ చేసి సరైన చర్యలు తీసుకుంటాం.

– దుగ్గిరెడ్డి, ఎస్ఐ, కసాపురం పోలీస్ స్టేషన్

క్లుప్తంగా

ఆత్మకూరులో కొలువుదీరిన పీర్లు



పీర్లకు చదివింపులు చేస్తున్న ముల్లా సాహెబ్ జాఫర్ వలి

ఆత్మకూరు: మొహర్రం వేడుకల్లో భాగంగా మండల కేంద్రంలో కొలువుదీరిన పీర్లకు గురువారం ముల్లా సాహెబ్ జాఫర్ వలి చదివింపులు చేశారు. భక్తులు కూడా స్వామికి చక్కెర చదివింపులు చేయించి మొక్కులు తీర్చుకున్నారు. శుక్రవారం స్వాములకు వెండి ఆభరణాల అలంకరణ, శనివారం అగ్ని గుండం ఏర్పాటు, 14వ తేదీన ఏడవ చిన్న సరిగెత్తుతో పాటు వన్నూరు స్వామి గ్రామోత్సవం ఉంటుంది. 15వ తేదీ విడిదినం, 16న పెద్ద సరిగెత్తు, 17వ తేదీ ఉదయం పీర్ల స్వాముల గ్రామోత్సవం, సాయంత్రం జలధికి పోవుట, 19వ తేదీన స్వామి చివరి దర్శనం ఉంటుందని గ్రామ పెద్దలు, నిర్వాహకులు తెలిపారు.

అనంత వాసులకు డాక్టరేట్లు



అవార్డు అందుకుంటున్న దేవరకొండ కౌసల్య

అనంతపురం కల్చరల్: అనంత వాసులకు మరో అరుదైన గౌరవం దక్కింది. వేర్వేరు రంగాల్లో పని చేస్తున్న వారికి పద్మ ప్రతిభ అవార్డులతో పాటూ గౌరవ డాక్టరేట్లు అందించారు. మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లో జరిగిన పురస్కారాల ప్రదానోత్సవంలో నగరానికి చెందిన ప్రముఖ నాట్య శిక్షకురాలు , సామాజిక సేవా కార్యకర్త దేవరకొండ కౌసల్య, సీనియర్ రచయిత కంబదూరు షేక్ నబీరసూల్‌కు గౌరవ డాక్టరేట్లతో సత్కరించారు. మనం ఫౌండేషన్ అధినేత డాక్టర్ చక్రవర్తి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ప్రముఖ సినీనటుడు సుమన్, మాజీ మంత్రి వేణుగోపాలచారి తదితరులు హాజరయ్యారు. అనంత వాసులు చేస్తున్న సామాజిక, సాహితీ, కళా సేవలను కొనియాడారు. పురస్కారాలు బాధ్యతను మరింత పెంచాయి. ఈ స్ఫూర్తితో మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని నబీరసూల్ తెలిపారు.

ఉత్తమ సేవలందించండి



మాట్లాడుతున్న డీఎల్‌డీఓ ఓబులమ్మ

ఆత్మకూరు: గ్రామ సచివాలయ ఉద్యోగులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలి. విధులకు సక్రమంగా హాజరవుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని డీఎల్‌డీఓ ఓబుళమ్మ సూచించారు. గురువారం మండలంలోని పంపనూరు, ఆత్మకూరు సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బందితో సమావేశమయ్యారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలను అందించాలన్నారు. ఉదయం, సాయంత్రం క్రమం తప్పకుండా బయోమెట్రిక్ వేయాలని సూచించారు. అనంతరం సచివాలయ సమీపంలో మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దశరథ రామయ్య తదితర సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటిన చిన్నారులు

ఆత్మకూరు: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణల్లో గురువారం చిన్నారులతో కలిసి అంగన్‌వాడీ సిబ్బంది మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ అధికారుల సూచనల మేరకు ప్రతి ఒక్క అంగన్‌వాడీ కేంద్రాల వద్ద మొక్కలు నాటినట్లు తెలియజేశారు. అంతేకాకుండా మొక్కలు నాటడం ద్వారా కలిగే ప్రయోజనాలను పిల్లలకు వివరించినట్లు పేర్కొన్నారు. చిన్నారులు తమ పలకల్లో చెట్లు గురించి పలు విషయాలు రాసి చూపించారు.

ఎమ్మెల్యేను కలిసిన 'అపుస్మా' నాయకులు



ఎమ్మెల్యే దగ్గుపాటికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అపుస్మా నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌ను అనంతపురం ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) సభ్యులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అపుస్మా జిల్లా అధ్యక్షుడు కుసుమ పుల్లారెడ్డి, ప్రధానకార్యదర్శి చంద్ర, గౌరవాధ్యక్షులు నాయుడు, రాష్ట్ర నాయకులు నాగరాజు, నగర అధ్యక్షుడు శ్రీనాథ్, సూర్యనారాయణ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, జలీల్, అన్వర్, లక్ష్మణ్, రఘునాథరావు, రామమ్మూర్తి పాల్గొన్నారు.

తల్లికి వందనమేదీ?



కనగానపల్లి/రాప్తాడు/ఆత్మకూరు/చెన్నేకొత్తపల్లి/రామగిరి: రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం పథకానికి అనేక కొర్రీలు పెడుతోంది. అమ్మఒడి పథకాన్ని తల్లికి వందనంగా మార్చి 1వ తరగతి నుంచి ఇంటర్ చదువుకునే ప్రతి విద్యార్థికి రూ.15 వేలు అందిస్తామని ఇటీవల సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో సీఎం చంద్రబాబు ఊదరగొట్టారు. తీరా అధికారంలోకి వచ్చాక ఈ పథకానికి ఆధార్ వర్తింపచేయడంతో పాటు అనేక నిబంధనలు పెడుతుండటంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన మొదలైంది. రాప్తాడు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 298 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, 14 ఇంటర్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో సుమారు 35,935 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వీరందరికీ తల్లికి వందనం కింద ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున అందించాల్సి ఉంది. కాని పాఠశాలలు తెరిచి నెల రోజులు కావొస్తున్నా.. ఇంతవరకు ఏ విద్యార్థికి ఈ పథకం కింద డబ్బు మంజూరు చేయలేదు. చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పిల్లల చదువులకు ఇబ్బంది



నా పేరు శ్యామల మాది చెన్నేకొత్తపల్లి మండలం ఆమిదాలకుంట గ్రామం. మాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరిని మా గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదివిస్తున్నాం. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం ఎన్నికల ముందు చాలా హామీలు ఇచ్చింది. తల్లికి వందనం కింద రూ.15 వేలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత దానిని అమలు చేయక ముందే కొర్రీలు పెడుతున్నారు. తాము వ్యవసాయ పనులు చేసుకుని పిల్లలను చదివించుకుంటున్నాం. ఇలా చేస్తే తమలాంటి వారు పిల్లలను చదివించుకునేందుకు ఇబ్బందులు పడతాం. చంద్రబాబు ఇచ్చిన మాటను నిలుపుకోవాలి.

– శ్యామల, ఆమిదాలకుంట, చెన్నేకొత్తపల్లి మండలం

హామీ ఎందుకు ఇచ్చారో?



మాది నిరుపేద కుటుంబం. నేను, నా భర్త కూలీ పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. మాకు ముగ్గురు కుమారులు. ప్రైవేట్ పాఠశాలలో చదివించే స్థోమత లేక పెద్ద కుమారుడు యుగంధర్ కింగ్ 7వ తరగతి, రెండో కుమారుడు మణి శంకర్‌ను నార్పల మండలంలోని పప్పూరులోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో చదివిస్తున్నాం. అలాగే చిన్న కుమారుడు అజయ్ కుమార్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. తల్లికి వందనం పథకంలో భాగంగా చదువుకునే పిల్లలందరికీ రూ.15 వేలు చొప్పున ఇస్తామన్నారు. తీరా గెలిచాక మాట తప్పుతున్నారు. కుటుంబంలో ఒకరికి మాత్రమే ఇస్తామంటూ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. హామీలు నెరవేర్చనప్పుడు ఇవ్వాల్సిన అవసరం లేదు. ఇప్పటికైనా చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో చెప్పిన విధంగా ప్రతి తల్లికి ఎంత మంది పిల్లలు ఉంటే వారందరికీ రూ.15 వేలు చొప్పున వేయాలి.

– మమత, ఎం.బండమీదపల్లి, రాప్తాడు మండలం

మాట నిలుపుకోవాలి



ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు బడికి వెళ్లే ప్రతి విద్యార్థికి తల్లివందనం కింద రూ.15 వేలు ఇస్తామన్నారు. కానీ ఇప్పుడు నిబంధనలు పెట్టి పిల్లల సంఖ్యను బట్టి కాకుండా తల్లికి రూ.15 వేల ప్రకారం ఇస్తామనడం సరికాదు. నాకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. వారంతా అనంతపురంలోని ప్రైవేట్ పాఠశాలల్లో చదువుకుంటున్నారు. ముగ్గురు పిల్లలకు ఫీజులు కట్టి బడికి పంపాలంటే కష్టంగా ఉంది. తల్లికి వందనం కింద ప్రభుత్వం పిల్లలందరికీ డబ్బులు ఇస్తే కొంత ఊరట కలుగుతుంది.

– జీ. సుజాత, రెడ్డివారిపల్లి, రామగిరి మండలం

రాప్తాడు నియోజకవర్గ సమాచారం

మండలం	ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు	ఇంటర్ కళాశాలలు	విద్యార్థుల సంఖ్య
రాప్తాడు	46	2	8,536
ఆత్మకూరు	42	2	4,442
కనగానపల్లి	53	2	3,882
చెన్నేకొత్తపల్లి	59	2	4,963
రామగిరి	53	2	4,732
అనంతపురం రూరల్	45	4	9,380
మొత్తం	298	14	35,935

ఇలా మోసం చేస్తారా చంద్రన్నా?



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు వరలక్ష్మి. ఆత్మకూరులో నివాసం ఉంటోంది. ఈమెకు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఒకరు ప్రైవేటు కళాశాలలో, మరొకరు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. ఇద్దరి పిల్లల్ని చదవించేందుకు ఏడాదికి రూ.లక్షకు పైగా ఖర్చు పెడుతోంది. ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడిచినా టీడీపీ ప్రభుత్వం అమ్మకు వందనం కింద రూ.15 వేలు సాయం అందించలేదు. ఎన్నికల హామీల్లో భాగంగా చంద్రబాబు నాయుడు పిల్లలు ఎంతమంది చదివితే అందరికీ తల్లికి వందనం ఇస్తామన్నారు. కాని ఇప్పుడు ఇంట్లో ఒక్కరికే నగదు ఇస్తామంటూ జీఓలో చెప్పడం దారుణం. ఇలా మాట తప్పి ప్రజలను ఎలా మోసం చేస్తారని వరలక్ష్మి ఆవేదన వ్యక్తం చేస్తోంది.

– వరలక్ష్మి, ఆత్మకూరు

ఐదుగురికి రూ.75 వేలు ఇవ్వాల్సిందే..



మాది రామగిరి మండలం మాదాపురం గ్రామం . నాకు ఐదుగురు పిల్లలు ఉన్నారు. వీరంతా ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకుంటున్నారు. ఎన్నికలప్పుడు చంద్రబాబు తల్లికి వందనం కింద బడికి పోయే పిల్లలందరికీ డబ్బు ఇస్తామని చెప్పారు. తీరా గెలిచాక లేనిపోని నిబంధనలు పెడుతున్నారు. నా ఐదుగురు పిల్లలకు రూ.15 వేల చొప్పున రూ.75 వేలు ఇవ్వాల్సిందే.. పాఠశాలలు తెరిచి నెలవుతున్నా ఒక్కరికీ డబ్బులు రాలేదు. దీంతో పిల్లలను బడులకు పంపాలంటే కష్టంగా ఉంది. వెంటనే డబ్బు అందజేయాలి.

– సాకే లక్ష్మిదేవి, మాదాపురం గ్రామం, రామగిరి మండలం

పారిశుధ్యం మెరుగుకు పటిష్ట చర్యలు



మురుగు తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: పారిశుధ్యం మెరుగుకు పటిష్ట చర్యలు తీసుకునేలా సంబంధిత అధికారులను ఆదేశించినట్లు మేయర్ వసీం పేర్కొన్నారు. గురువారం నగరంలోని సుభాష్ రోడ్డులో రైతు బజారుకు వెళ్లే ప్రాంతంలో డ్రైనేజీ మురుగు రోడ్డుపై ప్రవహించింది. విషయం తెలుసుకున్న మేయర్ ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. మురుగును తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీర్లను ఆదేశించారు. స్పందించిన అధికారులు వెంటనే సక్షన్ మిషన్ ద్వారా మురుగు తరలించేందుకు చర్యలు తీసుకున్నారు. మురుగు రోడ్డుపై వెళ్తుండటంతో జేసీబీ ద్వారా తాత్కాలికంగా కాలువను తీయించారు. లలిత కళాపరిషత్తు ముందు ఉన్నటువంటి కాలువలో కలిసేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, కార్పొరేటర్లు అబూసలేహా, అనిల్ కుమార్ రెడ్డి, కమల్‌భూషణ్, ఈఈ సూర్యనారాయణ, ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జనాభా నియంత్రణ సమష్టి బాధ్యత



రాప్తాడులో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, వైద్య సిబ్బంది

రాప్తాడు: జనాభా నియంత్రణకు ప్రతి ఒక్కరూ సమష్టిగా బాధ్యత తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారులు శివకృష్ణ, శ్రావణి అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక పీహెచ్‌సీ సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. చిన్న కుటుంబ–చింతలు లేని కుటుంబం, ఒకరు ముద్దు–ఇద్దరు వద్దు అంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. జనాభా పెరిగే కొద్దీ ఆహారం కొరత ఏర్పడుతుందన్నారు. అలాగే రోగాలు కూడా ఎక్కువ అవుతాయన్నారు. జనాభా పెరగడానికి ముఖ్య కారణం బాల్య వివాహాలు, మూఢ నమ్మకాలు అన్నారు. అనంతరం ఒకరు ముద్దు–ఇద్దరు వద్దు అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ శివ ప్రసాద్, సూపర్‌వైజర్లు నరసింహ, అరుణ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తికి గాయాలు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం బళ్లారి రోడ్డు ఎస్టేట్ సమీపంలో గురువారం ఓ వ్యక్తి రోడ్డు దాటుతుండగా ట్రాక్టర్ ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పాపంపేటకు చెందిన లింగయ్య బళ్లారి రోడ్డు ఎంవైఆర్ కళ్యాణ మంటపం ఎదురుగా సిమెంటు అంగడి నిర్వహిస్తున్నాడు. మధ్యాహ్నం 2:30 గంటల సమయంలో భోజనానికి ఇంటికి వెళ్లే క్రమంలో నడుచుకుంటూ రోడ్డు దాటుతుండగా అనంతపురం నుంచి ఉరవకొండ వైపు వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి ఢీ కొట్టింది. ప్రమాదంలో లింగయ్య కాలికి బలమైన గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు క్షతగాత్రుడిని సర్వజన ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మోక్షిత్ స్కూల్‌లో 'ఎల్లో డే'



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక షిరిడీ సాయి మోక్షిత్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో గురువారం ఎల్లో డే వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నపిల్లలతో ఆట పాటలు, బొమ్మలు వేయించారు. ఇలాంటి కార్యక్రమాల్లో పిల్లలు చురుగ్గా పాల్గొనడం వల్ల క్రమం తప్పకుండా బడికి వస్తారని ప్రిన్సిపాల్ సుబ్బారెడ్డి తెలిపారు.

గురుకులాల్లో సీట్ల సంఖ్య పెంచాలి



బీసీ కులాల రాష్ట్ర కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: వెనుకబడిన అనంతపురం జిల్లాలోని బీసీ గురుకుల పాఠశాలలో సీట్ల సంఖ్యను పెంచేలా చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. గురువారం విజయవాడలో బీసీ గురుకులాల రాష్ట్ర కార్యదర్శి కృష్ణమోహన్‌ను ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్ బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపాధ్యక్షుడు కుళ్లాయి స్వామి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధనుంజయ ప్రతాప్, నాయకులు ఎర్రిస్వామి కలిసి వినతి పత్రం అంజేశారు. ఈ సందర్భంగా జాన్సన్‌బాబు, కుళ్లాయి స్వామి మాట్లాడుతూ.. అనంతపురం జిల్లా కరువు ప్రాంతాన్ని దృష్టిలో ఉంచుకుని గురుకుల పాఠశాలలో సీట్ల సంఖ్యను పెంచాలని కోరారు. జిల్లాలో పేద, మధ్య తరగతి విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధి కోసం పక్క రాష్ట్రాలకు వలస వెళ్తారని పేర్కొన్నారు. పిల్లలు చదువుల కోసం ఇబ్బందులు పడుతున్నారన్నారు. బీసీ గురుకులాల కోసం చాలామంది దరఖాస్తు చేసుకున్నా.. పరిమిత సంఖ్యలో సీట్లు ఉండడంతో చాలా మందికి రాలేదన్నారు. సీట్ల సంఖ్యను పెంచి దరఖాస్తు చేసుకున్న తమ పిల్లలందరికీ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించాలని కోరారు. అన్ని నియోజకవర్గ కేంద్రాల్లోనూ గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయాలన్నారు.

'విన్నర్ డిజైన్ సొల్యూషన్'తో ఎస్ఆర్ఐటీ ఎంఓయూ



ఒప్పందం చేసుకుంటున్న ఎస్ఆర్ఐటీ కళాశాల యాజమాన్యం

బుక్కరాయసముద్రం: మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో విద్యా పరిశోధన అవకాశాలు పెంపొందించుకోవడం కోసం బెంగళూరులో ఉన్న విన్నర్ డిజైన్ సొల్యూషన్స్ ఎల్ఎల్‌పీతో (ఎంఓయూ) ఒప్పదం చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ గురువారం తెలిపారు. ఈ సహకారం విద్యార్థులకు పరిశ్రమలో అనుభవనం, ప్రాక్టికల్ అనుభవాన్ని అందించడం ద్వారా విద్యా, పరిశోధనా అవకాశాలు పెంపొందించడంలో తోడ్పడుతుందన్నారు. విన్నర్ డిజైన్ సొల్యూషన్స్ ఎల్ఎల్‌పీ స్థాపకుడు సీఈఓ సతీష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఈ భాగస్వామ్యం అకాడమీ, పరిశ్రమ మధ్య గ్యాప్ దూరం చేసి విద్యార్థులకు ప్రాక్టికల్ అనుభవం ఆవిష్కరణకు ప్రేరణ ఇవ్వగలదన్నారు. విన్నర్ డిజైన్ సొల్యూషన్స్ ఎల్ఎల్‌పీ 7డీ బీఐఎంపై దృష్టి సారించి బీఐఎల్ ఎస్‌సీఆర్, రామ్ మందిర్ వంటి ప్రాజెక్టులపై పని చేస్తూ ఏసీఈ పరిశ్రమలో 8 సంవత్సరాలకు పైగా అనుభవాన్ని కలిగి ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రంజిత్‌రెడ్డి, సివిల్ విభాగం హెడ్ డాక్టర్ చిన్న వెంకటరెడ్డి పాల్గొన్నారు.

32 షాపుల సీజ్



కొత్తూరు షాపింగ్ కాంప్లెక్స్‌లో షాపును సీజ్ చేస్తున్న దృశ్యం

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని కొత్తూరు నగరపాలక సంస్థ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఏళ్ల తరబడి అద్దె చెల్లించకుండా ఉన్న 32 షాపులను అదనపు కమిషనర్ శ్రీహరిబాబు గురువారం సీజ్ చేసేలా చర్యలు తీసుకున్నారు. కమిషనర్ మేఘ స్వరూప్ ఆదేశాలతో అదనపు కమిషనర్ శ్రీహరిబాబు, ఆర్‌ఓ సతీష్, ఆర్ఐ మురళీ తదితరులు కొత్తూరు షాపింగ్ కాంప్లెక్స్‌ను పరిశీలించారు. బకాయిలు చెల్లించని షాపులకు తాళాలు వేశారు. అదనపు కమిషనర్ శ్రీహరి బాబు మాట్లాడుతూ.. షాపు అద్దె బకాయిలు చెల్లించాలని లీజుదారులకు నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. కానీ వారి నుంచి ఎటువంటి స్పందన రాలేదన్నారు. ఏడు రోజుల వ్యవధిలో అద్దె చెల్లించాలని లేని పక్షంలో పంచనామా చేసి షాపులోని సామగ్రిని వేలం వేసి, మిగిలిన మొత్తాన్ని కోర్టులో దావా వేసి బకాయిలు వసూలు చేయనున్నట్లు హెచ్చరించారు.

యోగా గురువుకు అభినందన

అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన ప్రముఖ యోగా గురువు ఎం.బి.మహేష్‌బాబు సర్టిఫికెట్ ఆఫ్ వరల్డ్ రికార్డు అందుకున్నారు. గురువారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఏపీ ఐటీ శాఖా మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. యోగా గురువుగా మహేష్‌బాబు ఇప్పటి వరకు జిల్లాలో 400 కార్యక్రమాలను నిర్వహించారు. ముఖ్యంగా విద్యార్థుల్లో యోగాపై అవగాహన కల్పించడానికి రాష్ట్రపతి అవార్డు గ్రహీత భరత్, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ రమేష్‌బాబుతో కలిసి నిత్యం శ్రమిస్తున్నారు. భవిష్యత్తులో మరిన్ని యోగా కార్యక్రమాలను నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

అనంతపురం రూరల్: వాల్మీకి వాసంతిపై అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని వాల్మీకి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గంగాధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం వాల్మీకి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నంద్యాల జిల్లా పగిద్యాల మండలం ముచ్చుగిరి గ్రామంలో 9 ఏళ్ల వాసంతిపై అత్యాచారానికి పాల్పడి బాలిక చావుకు కారణమైన నిందితులను శిక్షించాలన్నారు. బాధిత బాలిక కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ముఖ్యమంత్రి, హోంమంత్రి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వాల్మీకి ఉద్యోగ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ స్వామి, కోశాధికారి కిషోర్, ఉపాధ్యక్షుడు సుధాకర్, కృష్ణమూర్తి, సీనియర్ నాయకులు నరహరి, రమణ, శ్రీధర్, ఓబిలేసు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ సంఘాల ఆధ్వర్యంలో నిరసన..

అనంతపురం టవర్‌క్లాక్: మహిళల మాన ప్రాణాలకు రక్షణ కరువైందని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ అధ్యక్షుడు సాకే హరి అన్నారు. నంద్యాల జిల్లా ముచ్చుమరి గ్రామంలో మైనర్ బాలిక వాల్మీకి స్రవంతిని అత్యంత కిరాతకంగా హత్య చేయడాన్ని ఖండించారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఎదురుగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. విచ్చల విడిగా మద్యం , గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలకు యువత బానిస కావడంతోనే నేరాలు పెరిగిపోతున్నాయన్నారు. మాదక ద్రవ్యాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తప్పవని చెప్పినా డ్రగ్స్ మాఫియా రాజ్యం ఏలుతోందన్నారు. స్రవంతిపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులు కూడా మైనర్‌లు కావడం అలాంటి వారికి గంజాయి ఎలా వచ్చిందో తేల్చాలన్నారు. దుర్మాగులు బాలికను హత్య చేసి కాలువలోకి వేస్తే ఇప్పటికీ మృతదేహం ఆచూకీ లభించలేదన్నారు. కార్యక్రమంలో రాజు, ఆదినారాయణ, ఈశ్వరయ్య, ధనుంజయ, ఆశిఫ్, నాగేంద్ర, మురళి, నారాయణ స్వామి, గోపాల్, ఓబులేసు, శాంతమ్మ, మారెక్క, పద్మావతి, రమాదేవి పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌తో ఇమామ్ భేటీ



వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలసిన కదలిక ఎడిటర్ ఇమామ్

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కదలిక ఎడిటర్ ఇమామ్ గురువారం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇమామ్ ఆరోగ్యం ఎలా ఉందని, తదితర విషయాలపై అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆరా తీశారు.

కొందరి సీట్ల మార్పు

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలో కొందరు ఉద్యోగుల సీట్లు మార్చుతూ కమిషనర్ మేఘ స్వరూప్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సీసీలుగా ఉన్న శ్రీకాంత్‌ను ఏ1, ఉదయ్‌కుమార్ రెడ్డిని బీ4 సీట్లకు మార్చారు. 7, 72 సచివాలయాల వెల్ఫేర్ కార్యదర్శులుగా ఉన్న ఎస్.సాయిప్రతాప్, పి. కిషోర్ కుమార్‌లను సీసీలుగా నియమించారు.

ప్లాస్టిక్ వాడొద్దు



తోపుడు బండ్ల వ్యాపారులకు సూచనలిస్తున్న అదనపు కమిషనర్ శ్రీహరిబాబు

అనంతపురం కార్పొరేషన్: నిషేధిత ప్లాస్టిక్‌ను వినియోగించవద్దని అదనపు కమిషనర్ శ్రీహరిబాబు వ్యాపారులకు సూచించారు. గురువారం నగరంలోని పలు ప్రాంతాల్లో వ్యాపారులతో అదనపు కమిషనర్ మాట్లాడారు. ఇడ్లీ తయారీలో స్టీమ్ చేసేటప్పుడు కవర్లు వాడకూడదన్నారు. అదేవిధంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగించరాదన్నారు. నిషేధిత ప్లాస్టిక్‌ను వినియోగిస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అదేవిధంగా హోటళ్లు, రెస్టారెంట్ నిర్వాహకులు ప్లాస్టిక్‌ను వినియోగించకూడదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అదనపు కమిషనర్ వెంట ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణుమూర్తి తదితరులు ఉన్నారు.

పారిశుధ్య కార్మికుడి మృతి

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని 5వ సర్కిల్‌లో విధులు నిర్వర్తించే పారిశుధ్య కార్మికుడు ఎస్. నారాయణ గురువారం ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణుమూర్తి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నారాయణ మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియలకు రూ.15,000 నగదును మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

అన్నదానం

రాప్తాడురూరల్: ధర్మవరం మాజీ సమితి ప్రెసిడెంట్, మాజీ మార్కెట్‌యార్డ్ చైర్మన్ దివంగత ఎంసీ నరసింహారెడ్డి మొదటి వర్ధంతి సందర్భంగా గురువారం అనంతపురం రూరల్ మండలం కాటిగానికాలువ వృద్ధాశ్రమంలో కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. బత్తలపల్లి మండలం ముష్టూరు గ్రామానికి చెందిన ఎంసీ నరసింహారెడ్డి సమితి ప్రెసిడెంట్‌గా, మార్కెట్‌యార్డ్ చైర్మన్‌గా పని చేశారు. అలాగే 30 ఏళ్ల పాటు సర్పంచ్‌గా పని చేశారు. ఆయన చేసిన ప్రజా సేవలను కుటుంబ సభ్యులు గుర్తు చేసుకున్నారు. సతీమణి ఎం.నారాయణమ్మ, ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

అనంతపురం టౌన్: నగరంలో 33 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ లక్ష్మీనారాయణ గురువారం తెలిపారు. నగరంలో లక్ష్మీనగర్, రామ్‌నగర్, కోవూర్ నగర్, పీటీసీ, జన్మభూమి రోడ్డు, నీలం సంజీవరెడ్డి బిల్డింగ్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుంది. ఆయా ప్రాంతాల ప్రజలు గమనించాలని కోరారు.